క్లుప్తంగా

అంబేడ్కర్ జయంతి వేడుకకు నూకతోటి

వరదయ్యపాళెం: నియోజకవర్గంలో జరగనున్న అంబేడ్కర్ జయంతి వేడుకల్లో వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పాల్గొననున్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు సత్యవేడు మండల కేంద్రంలోని కోర్టు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగే జయంతి వేడుకలకు ఆయన హాజరుకానున్నారు. అలాగే బీఎన్‌కండ్రిగ మండలం పచ్చాలమ్మ గుడి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగే వేడుకలకు నూకతోటి రాజేష్ హాజరుకానున్నట్లు ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటన వెలువడింది.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



చిన్నపాలేడు ఎస్టీ కాలనీలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యాహక్కు చట్ట ప్రకారం బడిఈడు పిల్లలు బడి బయట ఉండకూడదని, తప్పనిసరిగా బడిలో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి-2 మునిసుబ్రమణ్యం తెలిపారు. ఆయన ఆదివారం మండలంలోని చిన్నపాలేడు గిరిజన కాలనీ, పిచ్చిగుంట గ్రామంలోని బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు పంపించాలని, ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ తీసుకోవాలని కోరారు. హెచ్‌ఎం శైలజ, టీచర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు మరువలేనివి



అంబేడ్కర్ చిత్ర పటం ఊరేగింపు

వరదయ్యపాళెం: డాక్టర్ అంబేడ్కర్ పేద, బడుగు, బలహీన వర్గాలకు చేసిన సేవలు మరువలేనివి అని పులివల్లం అంబేడ్కర్ సంఘం నాయకులు తడ శీను అన్నారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ముందస్తు వేడుకలను ఆదివారం మండలంలోని పులివల్లంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి అలంకరణ చేసి స్థానిక పురవీధుల్లో ఊరేగించారు. అంబేడ్కర్ సేవలను కొనియాడుతూ నినాదాలు చేశారు.

వైద్యశిబిరం విజయవంతం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ లలిత

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం పాపానాయుడుపేట గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. తిరుపతికి చెందిన నరేంద్ర హాస్పిటల్ వైద్యులు నిర్వహించిన శిబిరాన్ని సర్పంచ్ లలిత ప్రారంభించారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ పాల్గొన్నారు.

సత్కారం



స్టార్ కృష్ణను సత్కరిస్తున్న నేతలు

ఏర్పేడు(రేణిగుంట): ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన అంబేడ్కర్ స్టార్ కృష్ణను ఆదివారం రేణిగుంట మండలం జీపాళెంలోని ఆయన నివాసంలో శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలంలోని పలువురు దళిత నాయకులు పూలమాల వేసి, శాలువాతో ఘనంగా సత్కరించి మహాత్మా జ్యోతిరావు, సావిత్రీబాయి పూలే చిత్రపటాన్ని బహూకరించారు. అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి రవి, నేషనల్ ఇన్సూరెన్స్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అంకయ్య, కాంగ్రెస్ మామ, సుబ్బరామయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మట్టలాదివారం ర్యాలీ



మట్టల ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

సత్యవేడు: మండలంలో క్రైస్తవులు, స్త్రీలు ఆదివారం మట్టల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీఎస్ఐ చర్చి పాస్టర్ జబస్టిన్ గుడ్‌ఫ్రైడే సందర్భంగా నిర్వహించిన మట్టల ఆదివారం ర్యాలీలో పాల్గొన్నారు. ఉదయం 8 గంటలకు, సాయంత్రం 6 గంటలకు పట్టణ కేంద్రంలోని గాంధీ విగ్రహ కూడలి వద్ద క్రైస్తవ సంఘాలు చేరి ఈత మట్టలు పట్టుకొని ర్యాలీ చేశారు. పాస్టర్ జబస్టిన్ మాట్లాడుతూ 2వేల సంవత్సరాలకు ముందు ఏసుక్రీస్తు సామాజికంగా తక్కువగా చూసే గాడిదను తన వాహనంగా ఎంపిక చేసుకొని దేవుని దృష్టిలో అందరూ సమానులే అన్న సత్యాన్ని ప్రబోధించారు.

అర్ధనారీశ్వరా నీ లెక్క తేలేదెట్టా..!

- విరాళాలకు రసీదులు నిల్
- పక్కదారి పడుతున్నట్లు విమర్శలు
- పట్టించుకోని ముక్కంటి ఆలయ ఉన్నతాధికారులు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి సుమారు 13 అనుబంధాలయాలు ఉన్నాయి. వీటిలో అర్ధనారీశ్వరాలయానికి ప్రత్యేకత ఉంది. ఈ ఆలయంలో ఓ వైపు స్వామి, మరో వైపు నుంచి అమ్మవారు భక్తులకు దర్శనమిస్తూండటం, ఆలయానికి ఉత్తరవాహినిగా స్వర్ణముఖి నది ప్రవహిస్తుండడంతో ఈ ఆలయం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. గత ప్రభుత్వ హయాంలో శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి ఈ ఆలయం వరకు రోడ్డు వేయాలని రూ.29కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రారంభించారు. అయితే సంవత్సరం గడుస్తున్నా ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదు,. ఈ ఆలయానికి గతంలో కొందరు మాత్రమే వెళుతుండేవారు. ప్రస్తుతం అనుబంధ ఆలయాలకు ప్రాముఖ్యత పెరిగింది. ఆలయంలో అనేక ఆంక్షలు ఉండడంతో పట్టణంలోని సంపతేశ్వరస్వామి ఆలయం, ముత్యాలమ్మగుడివీధిలోని చక్రేశ్వరస్వామి ఆలయం, అర్ధనారీశ్వరాలయాలకు భక్తుల సంఖ్య పెరిగింది. అంతేకాకుండా ఆలయ పరిసరాల్లో భూములను స్వా. దీనం చేసుకుని విశాలమైన ప్రాంగణం ఏర్పాటు చేసి గుడి నిర్మాణం జరుగుతోంది. శివం టూ శివం రోడ్డు ఏర్పడితే ఈ ఆలయానికి మరింత ప్రాముఖ్యత పెరగడం తథ్యమని ప్రస్తుత పరిస్థితులు తేటతెల్లం చేస్తున్నాయి. అయితే ఈ ఆలయం వైపు ఉన్నతాధికారులు ఏడాదిలో ఒకసారి కూడా కన్నెత్తి చూడకపోవడంతో సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం



వంటశాల

ఇష్టారాజ్యం

ఆలయంలో ప్రతి సోమవారం నిర్వహించే అభిషేకానికి పెద్ద సంఖ్యలో భక్తులు రావడం పరిపాటి. ఈ కారణం చేత మధ్యాహ్నం అన్నదానం కూడా చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా విరాళాల సేకరణ, అన్నదాన నిర్వహణ విమర్శలకు తావిస్తున్నాయి. ఎవరైనా దాతలు రూ.20వేలు చెల్లిస్తే అభిషేకం, అన్నదానం తామే నిర్వహిస్తామంటూ విరాళాల సేకరణ చేస్తున్నారు. అంతే కాకుండా నూనె, నెయ్యి, బియ్యం..ఇలా విరాళాల రూపంలో ఆలయానికి అందుతున్నాయి. వాటికి రసీదులు, స్టాక్‌బుక్‌లో ఎంట్రీ కానీ ఇక్కడ కనపడదు. దీంతో అక్కడ పనిచేస్తున్న పూజారి ఇష్టారాజ్యంగా మారింది. ఆలయం తరఫున జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ పర్యవేక్షణలో రసీదులు ఇవ్వడం, విరాళాలు సేకరించడం వంటివి పర్యవేక్షణ ఉండాల్సి ఉండగా అలాంటిది ఇక్కడేమీ కనిపించడం లేదు. అనుబంధ ఆలయానికి ఏవైనా విరాళాలు వస్తే వాస్తవానికి ప్రధాన గుడిలో జమ చేయాలి. అలాగే స్టాక్‌బుక్‌లో రిజిస్టర్ చేయాలి. ప్రధాన గుడి నుంచి కేటాయింపులు చేయాల్సి ఉండగా... అలాంటి చర్యలు ఇక్కడ తీసుకోవడం లేదు. జనవరి1, ఉగాది, శ్రీరామనవమి వంటి పండుగల్లో అత్యధిక సంఖ్యలో భక్తులు వస్తున్నారు. భారీ విరాళాలు ఇస్తున్నారు. అయితే వీటికి సరైన లెక్కలు లేకపోవడం గమనార్హం! ఉన్నతాధికారులు, పాలకులకు ఈ విరాళాల సేకరణలో వాటాలు ఉండటం వల్లే ఇలా పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇక అర్ధనారీశ్వరస్వామి లెక్క తేల్చేవారెవరో మరి!

శివయ్య సేవలో న్యాయమూర్తులు



జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌కి తీర్థ ప్రసాదాలు ఇస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరుని ఆదివారం న్యాయమూర్తులు దర్శించుకున్నారు. గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ కుటుంబసభ్యులతో వేరువేరుగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దక్షిణ గోపురం వద్ద వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు. అనంతరం మృత్యుంజయలింగం వద్ద స్వామి శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.



జస్టిస్ దుప్పల వెంకటరమణకు తీర్థ ప్రసాదాలు ఇస్తున్న ఆలయ అధికారులు

ఇంటర్‌లో విక్రమ్ విద్యార్థుల విజయకేతనం



పావని



గుణవర్ధన్



దక్షా

శ్రీకాళహస్తి: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో విక్రమ్ కాలేజీ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. శనివారం వచ్చిన పరీక్ష ఫలితాల్లో సీనియర్ ఎంపీసీ నుంచి ఇద్దరు, ఎంఈసీ నుంచి ఒకరు టౌన్ ఫస్ట్‌గా నిలిచారు. రెండో సంవత్సరం ఫలితాల్లో 1000 మార్కులకుగాను ఎంపీసీ గ్రూప్‌లో ఎం.పావని 988 మార్కులు, వై.గుణవర్ధన్ 988 మార్కులు, పి.రాఘవసాయి 983 మార్కులతో టౌన్ ఫస్ట్ ర్యాంకు సాధించారు. బైపీసీ గ్రూప్‌లో ఏ.భువన్‌వెంకట్ 960 మార్కులు సాధించారు. సీఈసీ గ్రూప్‌లో ఆర్.మోహిత్ జైన్ 945 మార్కులు సాధించారు. అలాగే ఎంఈసీ గ్రూప్‌లో 1000 మార్కులకుగాను ఏ.స్నేహజైన్ 896 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ గ్రూప్‌లో 470 మార్కులకుగాను 463 మార్కులతో వి.చందు, కె.తనూజశ్రీ కాలేజీ ప్రథమ స్థానం సాధించారు. అలాగే ఎంఈసీ గ్రూపులో 500 మార్కులుగాను 490 మార్కులు ఆర్.దక్షా పట్టణ ప్రథమ ర్యాంకులో నిలిచారు. సీఈసీ గ్రూప్‌లో ఎస్‌కే.హలీమా 500 మార్కులుగాను 484 మార్కులు సాధించి కాలేజీలో ప్రథమ స్థానంలో నిలిచారు. కాలేజీకి మంచి గుర్తింపు తీసుకొచ్చారు. విద్యార్థులను కాలేజీ డైరెక్టర్ డాక్టర్లు జి. చంద్రశేఖర్, కరస్పాండెంట్ శ్రీమతి మునిలక్ష్మి, సహచర విద్యార్థులు, కాలేజీ సిబ్బంది అభినందించారు.

నేడు అంబేడ్కర్‌కు నివాళి

శ్రీకాళహస్తి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించడానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని బస్టాండ్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉదయం 9.30 గంటలకు చేరుకోవాలని ప్రకటనలో పేర్కొన్నారు.

మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం గాజులమండ్యంలో నిర్వహించిన ఉచిత ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం శ్రీకృష్ణ భజన మందిరం కమిటీ అధ్యక్షుడు మిద్దె ఇందుకుమార్‌రెడ్డి, వన్నెకుల క్షత్రియ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ జి.పాళ్యం తేజోవతి ఆధ్వర్యంలో తిరుపతి రేవా డయాబెటిస్ క్లినిక్ సహకారంతో వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ రేఖ కత్తుల పర్యవేక్షణలో 30 మంది వైద్యబృందం వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరంలో వైద్యు పరీక్షలు చేసుకున్న వారికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. డాక్టర్ రేఖా కత్తుల మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి వైద్యం అందాలన్న లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డయాబెటిస్‌పై అవగాహన లేదని, అవగాహన కల్పించి చికిత్స అందించడమే మా లక్ష్యమని అన్నారు. లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రాజారేవంత్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, తిరుపతి రేవా డయాబెటిస్ క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు



వైద్య శిబిరానికి హాజరైన రోగులు

జీవితానికి దిక్సూచి భగవద్గీత

శ్రీకాళహస్తి: మానవ జీవితానికి దిక్సూచిగా పని చేసే ఒక అమోఘ గ్రంథం భగవద్గీత అని విద్యాస్వరూపానందగిరి స్వామి అన్నారు. పట్టణంలోని శ్రీసుఖబ్రహ్మాశ్రమంలో 75వ ఆశ్రమ వార్షికోత్సవం పూజశ్రీ 27 ఆరాధన మహోత్సవంలో భాగంగా ఆదివారం మూడవ రోజు, విద్యాస్వరూపానంద గిరి స్వాముల వారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరూపానందగిరి స్వాములు మాట్లాడుతూ భగవద్గీత మానవ జీవిత నైతిక విలువలను, జీవన విధానాన్ని నిత్యజీవితంలో సుఖశాంతులతో ఎలా బతకాలో దిక్సూచిగా పనిచేసే ఒక అమోఘ గ్రంథం అని అన్నారు. శ్రీ సుఖబ్రహ్మాశ్రమం వార్షికోత్సవాల్లో భాగంలో యోగా శిక్షణలో ఉత్తీర్ణులైన 45 మందికి ఆదివారం సుఖ బ్రహ్మ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వాములు చేతుల మీదుగా యోగా సర్టిఫికెట్లు అందజేశారు. యోగా మాస్టర్ మార్కండేయులు ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను అందించారు. విష్ణు సేవానంద స్వాములు, శ్రీ శ్రేయానంద సరస్వతి మాతాజీ, గురు చరణానంత మాతాజీ, కరూర బసవ రాజేంద్ర మహాస్వామి, శ్రీహరి తీర్థస్వామి, స్వప్రకాశానంద సరస్వతి స్వామి పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన స్వాములు

ఆ కులాలను ఎస్టీలో చేర్చొద్దు



ఆందోళన చేస్తున్న నేతలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): బీసీ-ఏ కులానికి చెందిన బోయలను, ఇతర కులాలను గిరిజన జాబితాలో చేర్చొద్దు అంటూ అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం, ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం ముక్తకంఠంతో నినదించారు. ఆదివారం రేణిగుంట అంబేడ్కర్ విగ్రహం వద్ద వివిధ గిరిజన సంఘం నాయకులు ఆందోళన చేశారు. ముందుగా స్థానిక గంగమ్మ గుడి ఆవరణలో గిరిజన సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో చేపట్టబోయే భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొరబు సత్యనారాయణ, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దినారి ప్రభాకర్ మాట్లాడుతూ బీసీ- ఏ కులానికి చెందిన బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడం వలన ఎరుకల, యానాది, లంబాడి, షికారీ కులాలకు ద్రోహం చేసిన వారవుతారని ధ్వజమెత్తారు. కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ నాయకులు తమ ఓట్ల కోసం, సీట్ల కోసం రాజ్యాధికారధ్యాసతో బాగా అభివృద్ధి చెందిన బోయ, ఇతర కులాలను గిరిజన జాబితాలో చేర్చడం దారుణమన్నారు. ఖాళీలను భర్తీ చేయకుండా నిరుద్యోగులైన గిరిజన బిడ్డలకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి హరినాథ్, ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టేటి ప్రసాద్, అఖిలభారత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు అజ్మీర రవి నాయక్, మండల కార్యదర్శి గోళ్ల వెంకటరమణ, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం మండల అధ్యక్షురాలు ధరణి, మండల కార్యదర్శి ఈశ్వరమ్మ, ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు చీరాలయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ధనుంజయులును సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

వరదయ్యపాళెం : వరదయ్యపాళెం మండలం కారిపాకం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1995-96లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆవుల చంద్రమౌళి ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఒకరినొకరు క్షేమ సమాచారం తెలుసుకున్నారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు ధనుంజయులును ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ధనుంజయులు మాట్లాడుతూ ఒక ఉపాధ్యాయుడిగా తన సర్వీస్‌లో 38 ఏళ్లు ఎంతో మంది విద్యార్థులను చూశానని తెలిపారు. 30 ఏళ్ల క్రితం తనవద్ద చదువుకున్న విద్యార్థులు మళ్లీ ఆహ్వానించి సన్మానించడం ఒక ఉపాధ్యాయుడిగా ఇంతకంటే సంతోషం మరొక్కటి వుండదన్నారు. తన శిష్యులు ఉన్నత శిఖరాలు అధిరోహించడం గర్వంగా వుందని వివరించారు. ఈ సంతృప్తి ఉపాధ్యాయ ఉద్యోగంలోనే వుంటుందన్నారు. ఇంతమంది విద్యార్థులు తనను మరిచిపోకుండా అభిమానంతో ఆదరించడం తన జీవితంలో మరిచిపోలేనని అన్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు 50 మంది దాకా పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణం కలేనా?

- 12 ఏళ్ల క్రితమే ప్రతిపాదనలు
- నిధులు మంజూరై మరలిపోయిన వైనం
- ఇప్పటికీ పట్టించుకోని ప్రభుత్వం
- అవస్థలు పడుతున్న అరుదూరు వాసులు



గత ఏడాది అరుదూరు మార్గంలో వాగులో నెట్టుకొస్తున్న స్కూటరిస్టు (ఫైల్)

వరదయ్యపాళెం: మండలంలోని అరుదూరు మార్గంలో వంతెనల ఏర్పాటు కలగా మారింది. వరదయ్యపాళెం నుంచి అరుదూరు మీదుగా కంచరపాళెం వరకు 4కి.మీల మేరకు పంచాయతీరాజ్ శాఖ రోడ్డు ఉంది. గతంలో ఈ రోడ్డు పూర్తిగా మట్టిరోడ్డుగా ఉండేది. 2007లో అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఆ రోడ్డు బీటీ రోడ్డుగా మారింది. అయితే ఆ రోడ్డులో రెండు చోట్ల కరుణా నదికి వెళ్లే రెండు కాలువలు ఉన్నాయి. ఆ ప్రాంతంలో వంతెనలు ఏర్పాటు చేయాల్సి ఉంది. రోడ్డు పనుల కోసం గతంలో మంజూరైన నిధుల్లో లోలెవల్ కాజ్‌వేల ఏర్పాటుకు మాత్రమే ప్రభుత్వం నిధులు కేటాయించింది. లోలెవల్ కాజ్‌వేల నిర్మాణం చేపడితే వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సంబంధిత పంచాయతీల ఇంజినీరింగ్ అధికారులు హైలెవల్ వంతెన కోసం కావాల్సిన నిధులకు సంబంధించి 12 ఏళ్ల క్రితం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. కానీ ఇప్పటివరకు ప్రభుత్వం పట్టించుకోలేదు. లోలెవల్ కాజ్‌వేలకు మంజూరైన నిధులు కూడా సమయం దాటిపోవడంతో వెనక్కి మళ్లాయి. రోడ్డు ఏర్పాటు చేసినప్పటికీ వంతెనల నిర్మాణం జరగకపోవడంతో సమస్య యథాతథంగా ఉంది.



అరుదూరు తాత్కాలిక వంతెన మార్గంలో అవస్థలు పడుతున్న ద్విచక్ర వాహనదారులు

కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన

మండలంలోని శ్రీ కల్కి గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా అరుదూరు మార్గంలోని ఒక కాలువ వద్ద 2016లో నిర్మించిన తాత్కాలిక వంతెన 2017లో కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. ఆ సమయంలో మరోమారు తాత్కాలిక వంతెనకు మరమ్మతులు చేపట్టి రాకపోకలను కొనసాగించారు. అయితే రెండేళ్ల క్రితం కురిసిన వర్షాలకు మరోమారు తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. దీంతో ఆ మార్గంలో వాహనదారులతోపాటు స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వర్షాకాలం వస్తే చుట్టుకుని రావాలి..

వర్షాకాలంలో అరుదూరు ప్రాంత ప్రజలు వరదయ్యపాళెం రావాలంటే చుట్టుకుని రావాల్సిందే. 3కి.మీల దూరంలో ఉన్న వరదయ్యపాళెంకు అటువైపుగా 8కి.మీల దూరం చుట్టుకుని రావాలి. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిధులు మంజూరు చేయాలి



అరుదూరు మార్గంలో వంతెన ఏర్పాటుకు ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేయాలి. లేదంటే రానున్నది వర్షాకాలం కావడంతో మళ్లీ మా గ్రామస్తులకు కష్టాలు తప్పవు. రాకపోకలకు చాలా ఇబ్బందిపడాల్సి వస్తుంది.
– రామకృష్ణారెడ్డి, అరుదూరు

మళ్లీ నిధులు ఇవ్వండి



అరుదూరు మార్గంలో లోలెవల్ కాజ్‌వేల నిర్మాణం కోసం మంజూరై వెనక్కి మళ్లిన నిధులను తిరిగి ప్రభుత్వం మంజూరు చేయాలి. ఆ నిధులతో నూతనంగా వంతెనల నిర్మాణం కోసం ప్రభుత్వం చొరవ చూపాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలి. – శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్, అరుదూరు

శాస్త్రోక్తంగా నాగశిల ప్రతిష్ఠ



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ప్రతిష్ఠించిన నాగశిల

వరదయ్యపాళెం: మండలంలోని సిద్దేశ్వరపురంలో ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో నాగశిలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. అర్చకులు నిరంజనాచార్యులచే వేద మంత్రాల నడుమ శిల ప్రతిష్ఠ జరిగింది. ఈ సందర్భంగా ప్రతిష్ఠ జరిగిన ప్రాంతంలో హోమ పూజలు నిర్వహించారు. గ్రామస్తులు మొక్కులు తీర్చుకున్నారు.